మీ కష్టసుఖాల్లో పాలు పంచుకుంటా..

- ప్రాణమున్నంత వరకు అచ్చంపేట ప్రజలతోనే ఉంటా..
- ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు
- గ్రామగ్రామాన ఘన స్వాగతం పలికిన ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు

మహిళలను కలిసి ఓటు అభ్యర్థిస్తున్న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

అచ్చంపేటరూరల్, నవంబర్ 25 : నల్లమల ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటూ ప్రాణమున్నంత వరకు అచ్చంపేట ప్రజలతోనే ఉంటానని బీఆర్ఎస్ అభ్యర్థి, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. శనివారం మండలంలోని రంగా పుల్, దర్గా తండా, బోల్గాట్‌పల్లి, లక్ష్మాపూర్, శంకరయ్యగుట్టతండా, నక్కెర్లపెంట, డొక్కుతండా, చెంచుపల్గుతండా, గుంపన్‌పల్లి, చౌటపల్లి, చౌటపల్లితండాల్లో అచ్చంపేట నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా ప్రాంతాల ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. గువ్వల బాలరాజు విజయాన్ని ఆకాంక్షిస్తూ గ్రామాల్లో ప్రజలు దండులా కదిలారు. గిరిజన మహిళలు సంప్రదాయ గిరి జన నృత్యాలతో బంతిపూల వర్షం కురిపిస్తూ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గువ్వల బాలరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలపై ఎవరికి నమ్మకంతో పాటు అవగాహన లేదని అసత్య హామీలను చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. 60 ఏండ్లలో కాంగ్రెస్ చేయలేని పనులను పదేండ్లలో బీఆర్ఎస్ చేసి చూపించిందన్నారు. మాయ మాటలు చెప్పి ఓట్లు దండుకోవాలని చూస్తున్న కాంగ్రెస్ పార్టీని ప్రజలు బొందపెట్టాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. మీ అందరి అమూల్య మైన ఓటును కారు గుర్తుకు వేసి మరో మారు ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. పేదల అభివృద్ధే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని, ప్రస్తుతం రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమాలతో పాటు తిరిగి అధికారంలోకి వచ్చిన వెంటనే చేసే పనులను ఆయన ప్రజలకు వివరించారు. అదే విధంగా మండలంలోని ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా చైర్మన్ పోకల మనోహర్, మున్సిపల్ చైర్మన్ నర్సింహాగౌడ్, ఎంపీపీ శాంతా బాబు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పర్వతాలు, రైతు బంధు మండలాధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ తులసీరాం నాయక్, పీఏసీసీఎస్ చైర్మన్ మందాడి రాజిరెడ్డి, నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, లోక్యనాయక్, రవీందర్‌నాయక్, వెంకటయ్య, సుధాకర్, రఘుపతి, భీమ్లానాయక్, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

మార్కండేయ ప్రాజెక్టుతో మహర్దశ

- పర్యాటక కేంద్రంగా మార్కండేయ ఆలయం
- అనుకున్న సమయానికి ప్రాజెక్టు పూర్తి
- ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

మార్కండేయ చెరువులో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

బిజినేపల్లి, నవంబర్ 25 : మండలంలోని కేఎల్ఐ కాలువ నీరు అందని గ్రామాలు, తండాలకు మార్కండేయ రిజర్వాయర్‌తో సాగునీరు అందుతుందని, రైతులకు ఇది మహర్దశ అని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలం లోని మమ్మాయిపల్లి గ్రామ శివారులో ఉన్న మార్కండేయ ఆలయాన్ని సందర్శించి శివుడికి కృష్ణాజలాలతో అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుకున్న సమయానికి మార్కండేయ ప్రాజెక్టును పూర్తి చేసి సాగునీరు అందించడం జరిగిందన్నారు. కోటి రూపాయల వ్యయంతో మార్కండేయస్వామి ఆలయాన్ని నిర్మించడం జరిగిందని చెప్పారు. ఈ ఆలయానికి మరో రూ.10 కోట్లు కేటాయించి కాటేజీలు, మినీ ఫంక్షన్‌హాల్ ఏర్పాటు చేస్తామని, ఒక పర్యాటక కేంద్రంగా రెండో సోమశిలగా తీర్చిదిద్దనున్నట్లు ప్రకటించారు. హైదరాబాద్‌లోని ట్యాంకుబండ్‌లా ఈ చెరువును మార్చుతామని చెప్పారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల మండలం లోని కొన్ని గ్రామాలు, తండాలకు పంటలకు సాగునీరు అందలేదన్నారు. రూ.80 కోట్ల వ్యయంతో సీఎం కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మార్కండేయ రిజర్వాయర్ పనులను పూర్తి చేయడం జరిగిందని చెప్పారు. గతంలో కేఎల్ఐ కాల్వ తీయడం జరిగిందని కానీ కాల్వపైన ఎత్తు ప్రాంతంలో ఉన్న గ్రామాల్లోని రైతుల పంటలకు సాగునీరు లేక ఇబ్బందులు పడే వారిని దీనిని దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఈప్రాంత రైతుల కోసం రిజర్వాయర్ నిర్మించి సాగునీరందించాలని కోరగా మార్కండేయ రిజర్వాయర్‌ను మంజూరు చేశారని వివరించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్, నాగర్‌కర్నూల్‌లో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి లేకపోతే మీ ప్రాంతానికి సాగునీరు రాకపోయేదని గుర్తు చేశారు. మరో 15నుంచి 20రోజుల్లో ఈ ప్రాజెక్టు కింద పిల్ల కాల్వలు పూర్తిచేసి పంట పొలాలకు సాగునీరు పారిస్తామని చెప్పారు. ఈ రిజర్వాయర్ ప్రారంభం కావడంతో గంగారం, పోలేపల్లి వెలుగొండ, సాయిన్ పల్లి, మమ్మాయిపల్లి మరో 17 తండాలకు పంట పొలాలకు నీరు అంది రైతుల జీవితాల్లో ఈ ప్రాజెక్టు వెలుగు నింపుతుందన్నారు. అంతకుముందు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యే మర్రికి స్వాగతం పలుకగా, అంతకుముందు మార్కండేయ చెరువులో ఆయన స్నానం చేసి కృష్ణాజలాలతో ఊరేగింపుగా వచ్చి శివుడికి అభిషేకం తోపాటు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాగునీరు, తాగునీరు అందించిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు మరోసారి మద్దతివ్వాలని, కారు గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ జక్క రఘునందన్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగం శశిధర్‌రెడ్డి, ఎంపీపీ శ్రీని వాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కురుమయ్య, పులేందర్‌రెడ్డి, చిన్నారెడ్డి, నాగమణి, కృష్ణ, శేఖర్‌రెడ్డి, పాండు నాయక్, చందులాల్,భారతి పాల్గొన్నారు.

మోసపోతే.. గోస పడతాం..

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలి
- కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

సింగవట్నం రోడ్ షోలో ప్రజలకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్, నవంబర్ 25 : అధికార దాహం కోసం కాంగ్రెసోళ్లు చెప్పే మాయ మాటలకు మోసపోతే మనం గోసపడతామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొల్లాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన సొంత గ్రామమైన సింగవట్నంలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 ఏండ్లుగా నియోజకవర్గాన్ని పాలించిన ఓ పెద్ద మనిషి చేయని అభివృద్ధిని తాను ఐదేండ్లలో చేసి చూపానని చెప్పారు. ఈ ఎన్నికలు 20 ఏండ్ల నియంతగా పాలనకు, ప్రజారంజక పాలనకు మధ్య జరిగే యుద్ధమని ఆయన పేర్కొన్నారు. పక్క రాష్ట్రం కర్ణాటక ఎన్నికల్లో హస్తం పార్టీ ఓటర్లకు ఐదు గ్యారెంటీ పథకాలను వాగ్దానాలు చేసిన కాంగ్రెస్ నాయకులు అధికారం వచ్చి ఆరు నెలలు దాటినా ఆ పథకాలను శ్రీకారం చుట్టబోయి బోర్లపడ్డారని, ఏది ఒక్కటి అమలు కాలేదన్నారు. ఆ రాష్ట్ర రైతులు మన తెలంగాణకు వచ్చి కాంగ్రెసోళ్ల మాటలకు మేము మోసపోయి గోసపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలో రైతుల వ్యవసాయానికి సరిపోను కరెంట్ ఇవ్వకపోడం చేత నీరందక చేతికొచ్చిన పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి గోస మనకు రాకుండా 24గంటలు కరెంట్ ఉండాలని కోరుకునే ప్రజలు బీఆర్ఎస్ వెంటే ఉండాలన్నారు. సింగవట్నంలో రూ.90లక్షలతో అంతర్గత సీసీరోడ్లు, రూ.10లక్షలతో మత్స్యకారుల సొసైటీ భవనం, మరో రూ.10లక్షలతో మహిళా సమాఖ్య భవనం నిర్మించామన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ సర్కారు వచ్చిన వెంటనే ఆసరా పింఛన్లు దశల వారీగా నెలకు రూ.5016లు, తెల్ల రేషన్‌కార్డు దారులకు రూ. 5లక్షల బీమా సౌకర్యం తోపాటు రూ.400లకే సిలిండర్ అందిస్తామని వివరించారు. ఈఎన్నికల్లో ఆదరిస్తే మరింత అభివృద్ధి చేసి కొల్లాపూర్ నియోజకవర్గం రూపురేఖలు మార్చేస్తానని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మామిడిపల్లి సింగిల్‌విండో చైర్మన్ చింతకుంట శ్రీని వాసులు, వైస్ చైర్మన్ స్వామి, ఉప సర్పంచ్ చింతచెట్టు సత్యనారాయణ, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు జింకల కిరణ్‌కుమార్, నాయకులు భూపేష్ సాగర్, యాదన్న గౌడ్, అన్వేష్‌గౌడ్, నర్సింహారెడ్డితోపాటు పార్టీ నాయకులు ప్రజలు ఉన్నారు.

దౌర్జన్యాలకు పాల్పడితే ఊరుకోం..

- రేవంత్‌రెడ్డి.. ఇదే మా చివరి హెచ్చరిక
- మొదట గెలువు.. ఆ తర్వాత సీఎం గురించి ఆలోచించు
- దమ్ము, ధైర్యం ఉంటే గ్రామాల్లోకి వచ్చి ఓట్లడుగు
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పట్నం

కోస్గి, నవంబర్ 25 : బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలపై దౌర్జన్యాలకు పాల్పడితే ఊరుకునేది లేదని కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి.. ఇదే మా చివరి హెచ్చరిక.. మేము దేనికైనా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కోస్గి మున్సిపల్‌లోని ఫామ్ హౌజ్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రజా సౌఖ్యాన్ని కాపాడేందుకు ఓపిక పడుతున్నామన్నారు. కోస్గి మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీషారాజేశ్ ఇంటిపై కాంగ్రెస్ కార్యకర్తలు దౌర్జన్యానికి పాల్పడ్డారని, ఇంకోసారి బీఆర్ఎస్ కార్యకర్తల జోలికొస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. రేవంత్‌రెడ్డి కొడంగల్‌లో నామినేషన్ వేసినప్పటినుంచి కార్యకర్తలను రెచ్చగొట్టి రాయలసీమ ఫ్యాక్షనిస్టుల్లా తయారు చేస్తున్నారన్నారు. ఓటమిభయంతోనే ఈ దుశ్చర్యలకు పాల్పడుతున్నారన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే గ్రామాల్లోకి వచ్చి ఓట్లడగాలని సవాల్ విసిరారు. నీకు కొడంగల్‌లోనే గెలిచే సత్తా లేదన్నారు. మొదట విజయం సాధించు.. ఆ తర్వాత సీఎం గురించి ఆలోచించాలని హితవు పలికారు. ఇప్పుడే ఇంత దౌర్జన్యంగా ఉంటే.. గెలిచిన తర్వాత ఏం చేస్తాడో ఊహకే అందడం లేదన్నారు. రైతుబంధు ఇస్తే కాంగ్రెస్‌కు ఓట్లు వేయరనే కుట్రతో కేసు వేశారని.. కానీ సీఈసీ రైతుబంధు అందించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. ఇది రేవంత్‌రెడ్డి చెంప పెట్టులాంటిదన్నారు. సమావేశంలో ఈజీఎస్ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీష, జెడ్పీటీసీ ప్రకాశ్‌రెడ్డి, ఎంపీపీ మధుకర్‌రావు, వైస్ ఎంపీపీ సాయిలు, కౌన్సిలర్లు శ్రీను, జనార్దన్‌రెడ్డి, బండెప్ప, నాయకులు రాజేశ్, రాజేందర్‌రెడ్డి, వరప్రసాద్, వెంకట్‌నర్సింహులు, సాయిలు, సత్యమూర్తి, నటరాజ్, వెంకటేశ్, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెసోళ్ల మాటలు నమ్మితే ఆగమైతం

- కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

పెద్దాపూర్ ప్రచారంలో మాట్లాడుతున్న కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

వెల్దండ, నవంబర్ 25 : కాంగ్రెసోళ్ల కల్లబొల్లి మాటలు నమ్మితే ఆగమైపోతాం.. ఆలోచించి ఓటు వేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. శనివారం వెల్దండ మండలం తిమ్మినోనిపల్లి, రాచూర్‌తండా, రాచూర్, కుప్పగండ్ల, పెద్దాపూర్, పోతెపల్లి, కొట్ర, బండోన్‌పల్లి, బొల్లంపల్లి, చల్లంపల్లి గ్రామాల్లో గోళి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే మరో 50 ఏండ్లు వెనక్కి వెళ్తామన్నారు. కాంగ్రెస్ చెబుతున్న గ్యారెంటీలు, ఎవరు ముఖ్యమంత్రి అయితే అమలు చేస్తారో చెప్పడం లేదని, వాళ్లలో వాళ్లకు సీఎం కుర్చీ పంచాయితీ మొదలైందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పటికే అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసి దేశానికే ఆదర్శంగా నిలిచిందని, మరోసారి అధికారంలోకి వస్తే అత్తకు ఆసరా పింఛన్ ద్వారా రూ.5వేలు, సౌభాగ్యలక్ష్మి ద్వారా కోడలికి రూ.3వేలు అందించనున్నది, అలాగే సిలిండర్‌ను రూ.400కే ఇస్తుందని అందుకే ప్రజలు బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో తనను ఎమ్మెల్యే గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ, జెడ్పీటీసీ విజితాఆనంద్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పుట్టా రాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్యగౌడ్, ఐజాక్, ఎంపీటీసీ గుత్తి వెంకటయ్య, పీఏసీసీఎస్ డైరెక్టర్ రాఘవేందర్‌రెడ్డి, గండికోట రాజు, రాజు నాయక్, బాలకృష్ణ, సర్పంచులు పాల్గొన్నారు.